పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుతాం.. 8లో..

కాలనీ వాసుల సమస్యల పరిష్కారానికి కృషి 8లో..



'పెద్దపల్లి' బీజేపీ టికెట్ ఎవరికో?

- పోటీపడుతున్న పలువురు నేతలు
- మోదీ చరిష్మాపైనే ఆశలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

మరో రెండు మాసాల్లో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పెద్దపల్లి నియోజకవర్గం నుంచి బీజేపీ టికెట్ ఎవరికి దక్కనున్నదనే అంశం చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గంలో పార్టీకి పెద్దగా కేడర్ లేకపోయినా ప్రధాని మోదీ చరిష్మాతో గెలిచే అవకాశాలు లేకపోలేదని ఆ పార్టీ భావిస్తున్నది. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో మెజారిటీ స్థానాలను గెలుచుకుని అధికార పీఠం ఎక్కిన కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు స్థానాలను క్లీన్ స్వీప్ చేసిన విషయం తెలిసిందే. పార్లమెంట్ ఎన్నికల్లో తాము గెలుపొందడం నల్లేరు మీద నడకేనని ఆ పార్టీ భావిస్తుండగా, సిట్టింగ్ స్థానాన్ని తిరిగి దక్కించుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నాలు చేస్తున్నది. ఈసారైనా ఈ స్థానం నుంచి ఖాతా తెరవాలని బీజేపీ భావిస్తున్నది. ఈ నియోజకవర్గం బీజేపీ సొంతంగా పోటీ చేసింది చాలా అరుదే. ప్రతిసారి పొత్తుల్లో భాగంగా ఈ స్థానం ఇతరులకు వెళుతున్నది. భారతీయ జనతా పార్టీ 1980లో పురుడు పోసుకున్నది. 1998లో 1999లో జరిగిన ఎన్నికల్లో ఎన్‌డీఏ భాగస్వామ్యంలో టీడీపీ ఉన్నందున పెద్దపల్లి స్థానాన్ని టీడీపీకే కేటాయించారు. ఇలా 2004 వరకు ఈ స్థానాన్ని టీడీపీకే కేటాయించారు. 2009లో టీఆర్ఎస్‌కు కేటాయించగా, 2014 నుంచి బీజేపీ సొంతంగా పోటీ చేస్తూ వస్తున్నది. దేశ వ్యాప్తంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ హవా వీస్తుండడం, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభావం తగ్గుతుండడంతో ఓటర్లు తమవైపు చూస్తున్నారనే భావనలో బీజేపీ నేతలు ఉన్నారు. పార్టీ కేడర్ అంతంత మాత్రంగానే ఉన్నప్పటికీ, ప్రజల్లో బీజేపీపై ఉన్న ఆదరణతో గెలుపొందే అవకాశాలు లేకపోలేదని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు వరకు ఇక్కడి నుంచి ఎంపీ అభ్యర్థి విషయంలో తమకు ఢోకా లేదని భావించింది. మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి బీజేపీలోనే ఉండడంతో ఎంపీ టికెట్ ఆయనకే దక్కేది. అనూహ్యంగా ఆయన యూ టర్న్ తీసుకుని కాంగ్రెస్ పార్టీలో చేరి చెన్నూరు నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. ఆయన పార్టీ మారడంతో బీజేపీలో బలమైన అభ్యర్థి లేకుండా పోయారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీకి చెందిన అభ్యర్థులకు గట్టి పోటీనిచ్చే అభ్యర్థుల కోసం బీజేపీ అధిష్ఠానం వెతుకుతున్నది. ఇతర పార్టీల నుంచి ఎవరైనా వస్తారా అని కూడా ఎదురుచూస్తున్నది. ప్రస్తుతం పార్టీ టికెట్ ఆశిస్తున్న నేతలతో పాటు బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ బొర్లకుంట వెంకటేశ్ నేత గానీ, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను పార్టీలోకి తీసుకరావాలని తెరవెనుక ప్రయత్నాలుజరుగుతున్నట్లుగా తెలుస్తున్నది.

అధిష్ఠానాన్ని ఆకర్షించే ప్రయత్నాలు..

బీజేపీకి చెందిన పలువురు పార్టీ నాయకులు టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ అధిష్ఠానాన్ని ఆకర్షించేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా వాల్‌రైటింగ్స్ చేయిస్తూ, ఫ్లెక్సీలు కూడా కట్టిస్తున్నారు. వికసిత్ సంకల్ప్ భారత్ వంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రజల్లోకి వెళుతున్నారు. అలాగే గోదావరిఖనికి చెందిన, బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి సోగాల కుమార్, మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య, కరీంనగర్‌కు చెందిన బీజేపీ ఎస్సీ రాష్ట్ర మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి, గోదావరిఖనికి చెందిన క్యాతం వెంకటరమణ టికెట్ కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు. సోగాల కుమార్ గత నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ధర్మపురి నుంచి పోటీ చేశారు. జర్నలిస్టుగా పని చేసి రాజకీయాల్లోకి వచ్చిన కుమార్ మొదటి నుంచి బీజేపీలోనే కొనసాగుతూ వస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలోనూ కీలక పాత్ర వహించడంతో పాటు పార్టీలో వివిధ స్థాయి పదవులు చేపట్టారు. 2009, ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయన ధర్మపురి నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేశారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి పోటీచేసి సుమారు లక్ష ఓట్లు సాధించారు. కరీంనగర్‌కు చెందిన జాడి బాల్‌రెడ్డి అలియాస్ బాలయ్య టీడీపీ ద్వారా రాజకీయాల్లో చేరారు. 2019లో బీజేపీ చేరారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ ధర్మపురి టికెట్ ఆశించారు. అది దక్కకపోవడంతో పార్లమెంట్ పరిధిలో నేతకాని సామాజిక వర్గం ఓటర్లు ఎక్కువగా ఉన్నారని, అదే సామాజిక వర్గానికి చెందిన తనకే పెద్దపల్లి టికెట్ ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఏబీవీపీ ద్వారా బీజేపీలోకి వచ్చిన మాజీ రైల్వే బోర్డు మెంబర్ క్యాతం వెంకటరమణ సైతం తనకే టికెట్ ఇవ్వాలని వాదిస్తున్నారు. బీజేపీలోనే కొనసాగుతున్న మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య గట్టి ప్రయత్నాలు చేయకపోయినా పార్టీ ఆదేశిస్తే రంగంలోకి దిగే అవకాశాలున్నాయి. అయితే పార్టీ టికెట్ వీరిలో ఎవరికైనా ఇస్తారా, మరెవరినైనా రంగంలోకి దింపుతారా అనే అంశం ఆసక్తిగా మారింది.

నిరుపేదలను ఆదుకోవడానికి ముందుకు రావాలి

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్


దయాలసిస్ రోగులకు బియ్యం అందజేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 4: నిరుపేదలను ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పిలుపునిచ్చారు. ఆదివారం గోదావరిఖని దుర్గానగర్‌లోని సహృదయ ఫౌండేషన్, నీడ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దయాలసిస్ రోగులకు బియ్యం, ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దయాలసిస్ రోగులు దినదినం గండంగా బతుకుతుంటారని, వారిని మానవతా హృదయంతో ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. రామగుండంలో దయాలసిస్ రోగులకు నీడ స్వచ్ఛంద, సహృదయ సంస్థలు అందిస్తున్న సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో సహృదయ ఫౌండర్ బిందు, నీడ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పల్లెర్ల రమేష్, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, నాయకులు చుక్కల శ్రీనివాస్, గట్ల రమేష్, రాజిరెడ్డి ఉన్నారు.

ఫొటోగ్రాఫర్ల సంక్షేమం, అభివృద్ధికి కృషి

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు


కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. ఆదివారం పెద్దపల్లి పట్టణంలోని నందన గార్డెన్‌లో జిల్లా ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటోగ్రాఫర్ల మేళా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఫొటోగ్రాఫర్ల సౌకర్యార్థం ఫొటో భవన నిర్మాణానికి కృషి చేస్తానని, 10 లక్షల రూపాయల నిధులను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఫొటోగ్రాఫర్ల సంక్షేమం, అభివృద్ధికి అండగా ఉంటానన్నారు. అనంతరం ఫొటోగ్రాఫర్లకు పరివార్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి భాస్కర్, ప్రధాన కార్యదర్శి పోగుల విజయకుమార్, కోశాధికారి వనపర్తి శ్రీనివాస్, ఫొటో టెక్ టీం ఓం ప్రకాష్, జూలూరి మధు, కార్యవర్గ సభ్యులు, మండలాల అసోసియేషన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారులు పాల్గొన్నారు.

సహకార సంఘ సభ్యులు కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలి

సుల్తానాబాద్, ఫిబ్రవరి 4: సహకార సంఘ సభ్యులు తమ సహకార బ్యాంకుల్లో ఉన్న ఖాతాల నిర్వహణ కోసం కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని సుల్తానాబాద్ సహకార సంఘం సీఈఓ బూరుగు సంతోష్ ఒక ప్రకటనలో కోరారు. గుర్తింపు రుజువు, ప్రస్తుత చిరునామా రుజువు(ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్సు తదితరమైనవి) ఇటీవలి పాస్‌పోర్టు సైజు ఫొటో, ఇతర అవసరమైన డాక్యుమెంట్లను సమర్పించి ఖాతాదారులందరూ తమను బ్యాంకులో సంప్రదించి కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని పేర్కొన్నారు.

నందిమేడారం కోర్టు బార్ అసోసియేషన్ అడహక్ కమిటీ ఎన్నిక


నార అశోక్‌రెడ్డి, అకారి రాజేశం

ధర్మారం, ఫిబ్రవరి 4: ధర్మారం మండలం నందిమేడారం కోర్టు బార్ అసోసియేషన్ అడహక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం నందిమేడారంలో బార్ అసోషియేషన్ భవనంలో సీనియర్ న్యాయవాది గాగిరెడ్డి మల్లారెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు అడహక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నార అశోక్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా బొట్ల లక్ష్మీనర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా అకారి రాజేశం, జాయింట్ కార్యదర్శిగా నూనె సత్యనారాయణలను ఎన్నుకున్నారు. అదేవిధంగా సీనియర్ ఈసీ సభ్యులుగా గడ్డం లింగారెడ్డి, ఈదుల ప్రదీప్‌రెడ్డి, జూనియర్‌గా బి గణేష్, ఉద్దండ నవీన్‌కుమార్‌లను ఎనుకున్నారు. ఈ ఎన్నిక కార్యక్రమంలో న్యాయవాదులు సొల్లు సత్యం, ఎంపెల్లి ప్రకాష్ ఆలుక వినోద్‌కుమార్, రామడుగు రాజేశం, గూడ జితెందర్‌రెడ్డి, బీసవేని మల్లీశ్వరి, పురాణం సందీప్ కుమార్, భీమారపు సంపత్‌కుమార్, సరిత, కొమ్మ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగుతున్న వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్, ఫిబ్రవరి4: జిల్లా పాఠశాలల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్-17 పాఠశాలల వేయిట్‌లిఫ్టింగ్ పోటీలు రెండవ రోజు ఆదివారం ఉత్సాహంగా సాగాయి.రాష్ట్రంలోని 8జిల్లాల నుంచి 140 మంది క్రీడాకారులు హాజరై ప్రతిభచాటారు. ఈ పోటీల్లో ప్రతిభచాటి విజేతలుగా నిలిచిన బాలబాలికలను బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో జరిగే జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలకు ఎంపిక చేశారు. విజేతలకు రాష్ట్ర పర్యవేక్షకులు శ్రీనివాస్ ప్రశంసాపత్రాలు, పతకాలను అందించారు. ఈకార్యక్రమంలో పోటీల నిర్వహణ కార్యదర్శి పోతన శ్రీనివాస్, పీడీలు, శంకరయ్య, బాబు శ్రీనివాస్, పీఈటీలు ఎల్‌వి రమణ, శ్రీలక్ష్మి, రాజ్‌కుమార్, వి.సూర్యప్రకాశ్, సత్యనారాయణ, డి.సత్యానంద్, ఎస్‌కె సఫియా, వివిధ జిల్లాల నుంచి హాజరై కోచ్ మేనేజర్లు పాల్గొన్నారు.

సింగరేణిలో 'గుర్తింపు' ఏదీ?

- ఫలితాలు వెలువడి నెల దాటినా ధ్రువీకరణ పత్రాలు అందని వైనం


సింగరేణి కార్మికులు(ఫైల్)

గోదావరిఖని, ఫిబ్రవరి 4: అనేక ప్రహసనాలు.. కోర్టు కేసులు.. పోరాటాల తరువాత ఏడేళ్ల పాటు ఎదురుచూడగా జరిగిన సింగ రేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ఫలితాల పరిస్థితి త్రిశంకు స్వర్గంలోనే ఉన్నది. డిసెంబర్ 27న సింగరేణిలో ఎన్నికలు జరిగి అదే రోజు రాత్రి ఫలితాలు కూడా వెలువడ్డాయి. కార్మికవర్గం ఏఐటీయూసీకి అనుబంధంగా ఉన్న సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌ను గుర్తింపు సంఘంగా ఎన్నుకున్నారు. ఎన్నికల ఫలితా లు కూడా ప్రకటించారు. సెంట్రల్ లేబర్ కమిషన్ ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వహణ జరిగింది. ప్రభుత్వశాఖలు, సింగరేణి యాజమాన్యం ఎన్నికల నిర్వహణకు సహకరించాయి. కానీ గెలిచిన ఏఐటీయూసీని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘంగా ధ్రువీకరించే విషయం ఇప్పటికీ తేలడం లేదు. గతంలో ఎన్నికలు నిర్వహిం చిన లేబర్ అధికారులే సింగరేణి గుర్తింపు కార్మిక సంఘాన్ని నిర్ధారించి ధ్రువీకరణ పత్రం ఇచ్చేది. ఆ సంఘం గుర్తింపు సంఘంగా అధికారికంగా వ్యవహరించేది. కానీ ఇప్పుడు కార్మిక శాఖ అధికారులు ఎన్నికలు నిర్వహించడం మాత్రమే తమ పని అని, ధ్రువీకరణ పత్రం ఇవ్వాల్సింది తాము కాదని అంటున్నారు. గతంలో గుర్తింపు సంఘాన్ని ధ్రువీకరించింది లేబర్ అధికారులేనని ఏఐటీయూసీ ప్రశ్నిస్తే అప్పుడు తప్పు జరిగితే ఇప్పుడు తాము అలా చేయాలా అని లేదని లేబర్ అధికారులు ప్రశ్నిస్తున్నారు. సింగరేణి సంస్థ కూడా తాము ధ్రువీకరించలేని, ఆ అర్హత తమకు లేదని చెబుతున్నది. దీంతో ఎన్నికలు గడిచి నెలా పది రోజులు అవుతున్నా ఏఐటీయూసీకి గుర్తింపు సంఘంగా, ఐఎన్‌టీయూసీకి ప్రాతినిధ్య సంఘంగా అధికారిక గుర్తింపు రాలేదు. ఎన్నికల్లో కార్మికుల ఆమోదం పొందారు తప్ప అధికారికంగా ఈ సంఘాలకు ఇప్పటికీ ధ్రువీకరణ లేదు. దీంతో కార్మిక సమస్యలు కూడా పరిష్కారం కాని వాతావరణం సింగరేణిలో ఏర్పడింది. దీనికి తోడు సింగరేణిలో మరో చిక్కు ఏర్పడింది.

అనేక సవాళ్లు..

కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను మారుస్తూ తీసుకువచ్చిన బిల్లులో ఎన్నికల్లో 10శాతం, ఆపైన ఓట్లు సాధించిన ఏ సంఘానికైనా యాజమాన్యాలతో సంప్రదించే హక్కు ఉంటుంది. సింగరేణి ఎన్నికల్లో ఐఎన్‌టీ యూసీ 30శాతానికి పైగా ఓట్లు సాధించింది. ఈ అంశంపై ఐఎన్‌టీ యూసీ తమను కూడా సంప్రదింపుల కమిటీల్లో స్థానం కల్పించాలని డిమాండ్ చేసే అవకాశం ఉంది. సింగరేణి ఎన్నికల్లో ఏఐటీయూసీకి ఐఎన్‌టీయూసీ కంటే 2800ఓట్లు ఆధిక్యం వచ్చినప్పటికీ డివిజన్ల వారీగా ఏఐటీయూసీ కంటే ఐఎన్‌టీయూసే ఎక్కువ డివిజన్లలో గెలుపొందింది. ఈ అంశం కూడా సాంకేతికంగా సింగరేణిలో చర్చకు వస్తున్నది. ఏఐటీయూసీ ఆర్‌జీ-1, ఆర్‌జీ-2, శ్రీరాంపూర్, బెల్లంపల్లి, మందమర్రి ఐదు డివిజన్లలో ప్రాతినిధ్య సంఘంగా గెలుపొందింది. కాగా ఆర్‌జీ-3, భూపాలపల్లి, ఇల్లందు, మణుగూరు, కొత్తగూడెం, కొత్తగూడెం కార్పొరేట్ ఆరు డివిజన్లలో ఐఎన్‌టీయూసీ ప్రాతినిధ్య సంఘంగా గెలిచింది. దీంతో ఒక ఏరియాలో ఐఎన్‌టీయూసీనే అధికంగా గెలిచింది. ఇన్ని చిక్కులతో అసలు సింగరేణిలో గుర్తింపు ఏది, ఎవరికి అనే ప్రశ్న కొనసాగుతున్నది. ప్రధానమైన ఈ అంశం తేలకముందే ఈ రెండు సంఘాల్లో పిట్ కమిటీల నుంచి సంప్రదింపుల కమిటీల వరకు నాయకులు పోటీలు పడుతున్నారు. ఐఎన్‌టీయూసీకి అదనంగా కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలు సిఫార్సు చేస్తే నాయకుల ఒత్తిడి కూడా తీవ్రంగానే ఉన్నట్టు తెలుస్తున్నది. ఏదేమైనా ఎదురుచూడగా వచ్చిన సింగరేణి ఎన్నికల ఫలితాలు తేలినప్పటికీ గుర్తింపు సంఘానికి అధికారిక హోదా ఇప్పటికీ కలుగకపోవడం చర్చనీయాంశం. సింగరేణి గుర్తింపు ఎన్నికల సందర్భంలో ప్రతిసారి ఇలాంటి చిక్కుముడులే ఏర్పడుతున్నాయి. గుర్తింపు సంఘానికి ధ్రువీకరణ దక్కినప్పటికీ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం రెండేళ్లే గుర్తింపు కార్మిక సంఘంగా ఉండాల్సి ఉంటుందా లేదా నాలుగేళ్ల పాటు ఈ సంఘాలే గుర్తింపులో ఉంటాయా అనేది కూడా స్పష్టతలేని అంశం. 2017లో జరిగిన ఎన్నికల సందర్భంలో కూడా నాలుగేళ్లకు గుర్తింపు సంఘం ఎన్నికల కాలపరిమితి అనుకుని ఎన్నికలు జరిగాయి. తీరా గెలిచిన తరువాత అప్పుడు టీబీజీకేఎస్‌కు గుర్తింపు రెండేళ్లే అంటూ లేబర్ అధికారులు ధ్రువీకరణ పత్రం ఇచ్చారు. దీనిపై టీబీజీకేఎస్ కోర్టుకు వెళ్లి నాలుగేళ్లపాటు కొనసాగుతూ వచ్చింది. ప్రస్తుతం కూడా అలాంటి చిక్కుముడి పడే అవకాశముంది.

'ఖని' ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు ఇబ్బందులు

- వెలగని లైట్లు.. తిరగని ఫ్యాన్లు - పట్టించుకోని అధికారులు


ఆసుపత్రిలోని జనరల్ వార్డులో పనిచేయని ఫ్యాన్

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 4: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో లైట్లు వెలగక, ఫ్యాన్లు తిరక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రూ.6 కోట్ల వ్యయంతో ఎన్‌టీపీసీ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన రెండవ అంతస్థులోని జనరల్ వార్డులో ఫ్యాన్లు తిరగడం లేదు. ప్రారంభించిన కొద్ది రోజులకే ఫ్యాన్లు తిరగకపోవడంతో వాటి నాణ్యతపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రోగులు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. రామగుండం మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న జనరల్ ఆసుపత్రిలో రోగులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ఆసుపత్రి సిబ్బంది విఫలమైందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్‌టీపీసీ సీఎస్ఆర్ ఆసుపత్రి నిధులు కేటాయిస్తున్నా వాటిని సక్రమంగా వినియోగించుకోవడంలో ఆసుపత్రి అధికారులు విఫలమవుతున్నారు. ఇటీవల ఎన్‌టీపీసీ సీఎస్ఆర్ అధికారులు ఆసుపత్రికి వచ్చి సౌకర్యాలపై ఆరా తీశారు. వారిని ఆసుపత్రి అధికారులు మర్యాదపూర్వకంగా కూడా కలువలేదు.

ఇప్పటికే ఎన్‌టీపీసీ తన నిధులతో రెండు అంతస్థుల భవనంతో పాటు చిల్డ్రన్ కేర్, ఆపరేషన్ థియేటర్‌లో కావాల్సిన పరికరాలను, లైటింగ్ సిస్టంట్‌ను సమకూర్చింది. ఇప్పటికైనా రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.

భక్తులతో కిక్కిరిసిన మల్లన్న ఆలయం


క్యూ లైన్‌లో వేచి ఉన్న భక్తులు


పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

ఓదెల, ఫిబ్రవరి 3 : జిల్లాలో ప్రసిద్ధికెక్కిన శైవ క్షేత్రం భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ పరిసరాలన్నీ ఆదివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఈనెల చివరి వారంలో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మక్క, సారలమ్మ జాతర నిర్వహించనున్నందున ముందుగా భక్తులంతా ఓదెల మల్లన్న, ఐలోని మల్లన్న, వేములవాడ, కొమురవెల్లి, శైవ క్షేత్రాలను దర్శించుకుని మొక్కులు చెల్లించడం తరతరాలుగా ఆనవాయితీగా వస్తోంది. ఈ మేరకు మొక్కులను పూర్తి చేసుకున్న తర్వాతనే మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు తరలివెళ్లనున్నారు. ముందుగా భక్తులంతా తరలివచ్చి ఓదెల భ్రమరాంబ మల్లికార్జున స్వామిని, అలాగే పోచమ్మ తల్లి, రామాలయాన్ని దర్శించుకున్నారు. హైదరాబాద్, భూపాలపల్లి, వరంగల్, సిద్దిపేట, పెద్దపల్లి, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాలతో పాటు వివిధ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో జాతరకు తరలిరావడంతో మల్లన్న దర్శనానికి మూడు గంటల పాటు భక్తులు క్యూ లైన్‌లో వేచి ఉండాల్సి వచ్చింది. జాతరకు దాదాపు 15వేల మందికి పైగా భక్తులు హాజరై బోనాలను, పట్నాలు, కోడె మొక్కులు సమర్పించారు. జాతర స్థల విస్తీర్ణం తక్కువ ఉండడం వల్ల వాహనాలతో తరలివచ్చిన భక్తులంతా తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

మున్సిపల్ కౌన్సిలర్ కుటుంబానికి పరామర్శ

సుల్తానాబాద్, ఫిబ్రవరి 4: సుల్తానాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ గొట్టం లక్ష్మీమల్లయ్య కుటుంబాన్ని ఆదివారం పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడైన మల్లయ్య సుల్తానాబాద్ మేజర్ గ్రామపంచాయతీ ఉప సర్పంచ్‌గా, ఎంపీటీసీగా పనిచేశారు. ప్రస్తుత మున్సిపల్ కోఆప్షన్ సభ్యులుగా ఉన్నారు. అనారోగ్యంతో మృతిచెందిన మల్లయ్య భార్య లక్ష్మి ప్రస్తుతం బీఆర్ఎస్ నాయకురాలిగా, తొమ్మిదవ వార్డు కౌన్సిలర్ కొనసాగుతున్నారు. మల్లయ్య చిత్రపటం వద్ద పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ మాజీ ఛైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్, ఎంపీపీ బాలాజీరావు, జడ్పీటీసీ మినుపాల స్వరూప ప్రకాష్ రావు, సింగిల్‌విండో ఛైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ బుర్ర శ్రీనివాస్ తదితరులు నివాళులర్పించారు. కాగా, బీఆర్ఎస్ నాయకుడు మాటేటి గట్టయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా దాసరి మనోహర్‌రెడ్డి తదితరులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

మంథనిరూరల్, ఫిబ్రవరి 4: మంథని మండలం కన్నాల గ్రామానికి చెందిన చంద్రయ్య(50) అనే రైతును గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిడంతో ఆదివారం మృతిచెందాడు. చంద్రయ్య పొలం వద్దకు బైక్‌పై వెళ్లాడు. పని పూర్తి చేసుకుని మంథని-గోదావరిఖని ప్రధాన రహదారి మీదకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

విద్యార్థులు క్రమశిక్షణ పాటించాలి

జమ్మికుంట, ఫిబ్రవరి 4: జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే విద్యార్థులు క్రమశిక్షణ పాటించాలని సైకాలజిస్ట్ రవికాంత్ అన్నారు. ట్రస్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

వెంటాడుతున్న మొగి పురుగు

- తెగులు ఉధృతికి ఎర్రబారుతున్న పొలాలు
- దిగుబడిపై ప్రభావం
- నాట్లు వేసిన పదిహేను రోజుల నుంచే పంటను ఆశిస్తున్న పురుగు
- ఆందోళనకు గురవుతున్న అన్నదాతలు



జిల్లాలో మొగిపురుగు సోకిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

జగిత్యాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వరి రైతును మొగి పురుగు వెంటాడుతోంది. గత యాసంగిలో సోకినట్లుగానే ఈ సీజన్‌లో సైతం వరి పంటలను మొగి పురుగు ఆశిస్తోంది. భారీ వర్షాల కారణంగా వానాకాలం వరి పంట అన్నదాతకు నష్టాలే మిగి ల్చింది. ఎన్నో ఆశలతో యాసంగి సాగు ప్రారంభించిన రైతులకు ఆదిలోనే తెగుళ్ల బెడద మొదలైంది. ఈ యేడాది సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండాయి. దీనికి తోడు కాలువల ద్వారా సాగు నీరు అందిస్తుండడంతో రైతులు యాసంగిలో ముమ్మరంగా వరి నాట్లు వేశారు. వేసిన 15 రోజుల్లోనే వరిలో మొగి పురుగు సోకి కాండం కుళ్లిపోతోంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా వరిలో అక్కడక్కడ మొగి పురుగు సోకుతోందని నిపుణులు అంటున్నారు. తెగులు ఉధృతికి పంట ఎర్రబారుతోందని అన్నదాతలు వాపోతున్నారు. వ్యవసాయ శాఖ సమా చారం ప్రకారం రాష్ట్రంలో ప్రస్తుత యాసంగిలో వరి సాగు సుమారు 30.43 లక్షల ఎకరాల్లో ఉండగా అందులో జగిత్యాల జిల్లాలో ఇప్పటివరకు 2,69,817 ఎకరాల్లో వరి సాగు అవుతోంది. వరి పైర్లు కొన్ని చోట్ల నారుమడి దశలోనూ, మరికొన్ని ప్రాంతాలలో పిలకదశలోనూ ఉన్నాయి.

● **అన్నదాతకు అదనపు వ్యయం..**

జగిత్యాల జిల్లాలోని జగిత్యాల, కోరు ట్ల, మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్లలోని పలు ప్రాంతాల్లో మొగి పురుగు ప్రభావం అధికంగా ఉంది. ప్రతీ యేటా మొగి పురు ఉధృతి పెరుగుతోంది. రైతులు పంట మార్పిడి చేయడం లేదు. పొలం పూర్తిగా ఎండిపోకుండానే మళ్లీ సాగు ప్రారంభించడం, దుక్కి మందులో సల్ఫర్ అధికంగా వాడడంతో పొలాలు వదులై మొగి పురుగు ఉధృతి పెరుగుతోందని వ్యవసాయ నిపుణులు, అధికారులు అంటున్నారు. ప్రస్తుత యాసంగిలో వరి నారుమడులపైనే రెక్కల పురుగు ఉంటుంది. నివారణ కోసం పురుగు మందు పిచికారి వేసి కొన్ని ప్రాంతాల్లో నాట్లు వేశారు. పురుగు పెట్టిన గుడ్లు ఎదిగి కాండం కింది భాగాన్ని తొలుస్తున్నాయి. తర్వాత దశలో కంకి తెల్లగా మారుతోంది. చివరికి దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు. పురుగు మందులకు అదనంగా వ్యవసాయ పె ట్టుబడులు పెడుతున్నారు. దీంతో రైతులపై ఆర్థిక భారం ఎక్కువవుతోం ది. దీంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు.



మొగి పురుగుతో ఎర్రబారిన వరి



నివారణ చర్యలు తీసుకుంటేనే ఫలితం..

ఈ యాసంగిలో నారుమడి, పిలక దశల్లో మొగి పురుగు అధికంగా గమనించాం. నారుమడిలో 600 గ్రాముల ఫిప్రోనిల్ 0.3డి గుళికలు వేయాలి. నారు మడిలో వేయకపోతే 15 రోజుల వయస్సున్న, పిలక దశలో ఉన్న వరి పైరులో తప్పకుండా ఎకరాకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 10 కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు 8 కిలోలు, లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.4జి గుళికలు 4 కిలోలు 20 నుంచి 25 కిలోల ఇసుకలో కలిపి బురద పదునులో వేయాలి. అనంతరం వరి పంట చిరు పొట్ట దశలో ఉన్నప్పుడు రెక్కల పురుగు ఉధృతి గమనిస్తే కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 శాతం, ఎస్‌పి 2 గ్రాములు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మిల్లీ లీటర్లు లేదా ఐసోసైక్లోసిరమ్ 0.6 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పంటపై పిచికారి చేయాలి.

- బలరాం, సీనియర్ శాస్త్రవేత్త, జగిత్యాల జిల్లా

నిజాం షుగర్స్ పునరుద్ధరణకు సమీక్ష

● సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నత స్థాయి సమావేశం

జగిత్యాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): లే ఆఫ్‌తో మూసివేసిన నిజాం షుగర్స్ కర్మాగారాలను పునరుద్ధరించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆదివారం హైద్రాబాద్‌లోని సీఎం పేషీ కార్యాలయంలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డిలతో కలిసి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పరిచారు. నిజామాబాద్ జిల్లా బోధన్, జగిత్యాల జిల్లా ముత్యంపేట, మెదక్ జిల్లా ముంబోజుపల్లిలో గల నిజాం షుగర్ పునరుద్ధరణ కోసం పరిశీలించాల్సిన అంశాలు, కొన్ని సంవత్సరాలుగా కర్మాగారాలు మూసివేసి ఉండడం వల్ల మిషనరీ పరిస్థితి, రైతుల ఆసక్తి, చెరుకు సాగు తదితర అంశాలపై పలు వివరాలను సేకరించారు. నిజాం షుగర్స్ పునరుద్ధరణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఛైర్మన్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిలతో కలిసి సుమారు రెండు గంటల పాటు సుదీర్ఘ చర్చ జరిపారు. ఏ విధంగా నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ కర్మాగారాలను తెరిపించాలి, ఆర్థిక పరిస్థితి, బకాయిల చెల్లింపు, మిషనరీ పునరుద్ధరణ, ఉద్యోగులు, కార్మికుల పరిస్థితి, రైతులకు చేకూర్చాల్సిన మేలు తదితర అంశాలపై సుదీర్ఘ చర్చ జరిపారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ అతి త్వరలో చెరుకు రైతులకు తీపి కబురు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఎన్నికల సందర్భంగా చెరుకు రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చడానికి కాంగ్రెస్ సర్కారు కట్టుబడి పనిచేస్తుందని స్పష్టం చేశారు. అందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారని వివరించారు.



సమీక్ష నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన

- మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ప్రేం పావని



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు ప్రేం పావని

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 4: ఐక్య పోరాటాలతోనే హక్కులు సాధించవచ్చని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ప్రేం పావని అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తా నుంచి పద్మశాలి కళ్యాణ భవనం వరకు మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కార్మికులు ఎర్రజెండాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పద్మశాలి కల్యాణ భవనంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రథమ మహాసభ జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ప్రేం పావని మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. దాదాపు 60 సంవత్సరాలుగా సమస్యలతో కార్మికులు సతమతం అవుతూ కష్టాలను నష్టాలను ఓర్చుకుంటూ విద్యార్థులకు సేవలనందిస్తున్నారని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు సమ్మెకు వెళ్లడంతో అప్పటి ప్రభుత్వం దిగివచ్చిందన్నారు. వేయి రూపాయల నుంచి మూడు వేల రూపాయల వేతనాలు పెంచడానికి అంగీకరించిందన్నారు. ఎన్నికల సమయం కావడం వల్లే అప్పటి ప్రభుత్వం వేతనాలను పెంచుతామన్నారు తప్పా చిత్తశుద్ధితో హామీనివ్వలేదని అర్థం అయిందన్నారు. మధ్యాహ్న భోజన వర్కర్లకే వేతనాలు దిక్కులేదంటే గత ప్రభుత్వం అల్పాహారం అంటూ కార్మికులపై అదనపు భారం పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు ఐక్యతతో పోరాటాలు చేస్తే తప్పా ఈ ప్రభుత్వాలు దిగిరావని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు నెలలు తరబడి బిల్లులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతన చట్ట ప్రకారం వేతనాలు ఇవ్వాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, పెన్షన్ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మెనిఫెస్టోలో ప్రకటించిన కార్మికులకు గౌరవ వేతనం చెల్లించాలన్నారు. కార్మికులకు నిత్యావసర సరుకులు, గ్యాస్ సిలిండర్ ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. ప్రతీ సంవత్సరం కార్మికులకు ప్రభుత్వం రెండు జతల యూనిఫాం ఇవ్వాలని అన్నారు. మహాసభలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, ఉప ప్రధాన కార్యదర్శి సత్తైనపల్లి విజయలక్ష్మి, రాష్ట్ర నాయకుడు ధర్మల రామ్మూర్తి, జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మన్, జిల్లా ఉపాధ్యక్షులు పంతం రవి, లక్ష్మి, మహేశ్వరీ, మల్లవ్వ, కొమరవ్వ, సాయిలు, కొమరయ్య, హసీనాబేగం లావణ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు, వివిధ మండలాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

వేములవాడలో కొనసాగుతున్న భక్తుల రద్దీ



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వేములవాడ, ఫిబ్రవరి 4: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. సమ్మక్క, సారలమ్మ జాతరను పురస్కరించుకుని రోజు రోజుకు ఆలయానికి భక్తుల రాక పెరుగుతోంది. ఆదివారం సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రాజన్న క్షేత్రానికి తరలివచి ఆలయ వసతిగదుల్లో విడిది చేశారు. ఆదివారం తెల్లవారుజామునే భక్తులు ఆలయ ధర్మగుండంలో స్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. అనంతరం ఆలయ క్యూలైన్‌ల ద్వారా భక్తులు రాజన్న ఆలయంలోకి చేరుకుని శ్రీపార్వతి పరమేశ్వరులను దర్శించుకున్నారు. అనంతరం భక్తులు శ్రీస్వామి వారికి అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. తదనంతరం అనుబంధ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. రాజన్న ఆలయానికి తరలివచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలేత్తకుండా ఆలయాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కాగా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి అనుబంధ ఆలయమైన శ్రీబద్దిపోచమ్మ అమ్మవారి ఆలయానికి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించేందుకు బోనాలను నెత్తిలో పెట్టుకుని డప్పుచప్పుల్లతో శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు.

మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

గంగాధర, ఫిబ్రవరి 4: గంగాధర మండలం గర్షకుర్తిలో ఆదివారం మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై పుల్ల అభిలాష్ తెలిపారు. అనుమతులు లేకుండా రెండు ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి పట్టుకున్నట్లు తెలిపారు. మండలంలో ఏలాంటి అనుమతులు లేకుండా ఇసుక, మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

రాయికల్, ఫిబ్రవరి 4: రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ మహేందర్ సస్పెన్షన్‌కు గురయ్యారు. లంచం కోసం వేధిస్తున్నారనే ఆరోపణలతో ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ సస్పెండ్ చేశారు. రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో మహేందర్ కోర్టు విధులు నిర్వర్తిస్తుంటారు. కానిస్టేబుల్ మహేందర్ ఓ కేసు విషయంలో తరచూ డబ్బులు అడుగుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని అల్లీపూర్ గ్రామానికి చెందిన రమేష్ ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. పూర్తి ఆధారాలు సమర్పించాడు. దీనిపై విచారణ చేసిన ఎస్పీ మహేందర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

హోటల్‌ను సీజ్ చేసిన మున్సిపల్ అధికారులు



హోటల్‌ను సీజ్ చేస్తున్న మున్సిపల్ అధికారులు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 4: మున్సిపాలిటీలో చేసుకున్న ఒప్పందానికి భిన్నంగా వ్యవహరించి, అనుమతులు లేకుండా అనధికారికంగా ఆనంద్ భవన్ హోటల్ పేరుతో వ్యాపారంపై బల్దియా అధికారులు కొరడా ఝులిపించారు. ఆదివారం వేకువ జామునే పట్టణంలోని పార్క్ ఎదుట టౌన్ హాల్‌లో నిర్వహిస్తున్న ఆనంద్ భవన్‌ను మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు మాట్లాడుతూ ఆనంద్ భవన్‌పేరుతో నడపబడుతున్న ఈ హోటల్ ఒప్పందానికి వ్యతిరేకంగా నడుపబడుతుందని, అందుకే ఈ హోటల్‌ను సీజ్ చేసి నట్లు తెలిపారు. ఇందులో పని చేస్తున్న సిబ్బంది, వారికి సంబంధించిన సామానులను భవనం నుంచి ఖాళీ చేయించామన్నారు. హోటల్ మూసివేసే క్రమంలో అన్ని విధాలుగా నిబంధనలు పాటించామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఈ హోటల్‌కు నోటీసులు అందించామని, నిర్వాహకుల నుంచి వచ్చిన సమాధానం సంతృప్తికరంగా లేనందునే చర్యలకు సిద్ధమైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అయితే ఈ అంశంపై పలు పత్రికల్లో వార్తా కథనాలు రావడం, ప్రజలనుంచి అనేక ఆరోపణలు వచ్చినా అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోగా, అనూహ్యంగా ఆదివారం వేకువజామునే సీజ్ చేయడం ప్రస్తుతం జగిత్యాల పట్టణంలో హాట్‌టాపిక్‌గా మారింది.


డబ్లింగ్ పనులతో పలు రైళ్ల రాకపోకలు రద్దు

పెద్దపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ మౌలాలి నుంచి సనత్‌నగర్ రైల్వే స్టేషన్ మధ్య డబ్లింగ్ పనులతో పాటు నాన్‌ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా ఈనెల 5 నుంచి 11వ తేదీ వరకు పలు రైళ్లను రద్దుచేశారు. 17011/12 హైదరాబాద్ నాంపెల్లి నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్‌కు అక్కడినుంచి హైదరాబాద్‌కు నడిచే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు. 12757/58 సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వరకు నడిచే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను కూడా రద్దు చేశారు. 17233/34 నంబర్‌గల భాగ్యనర్ ఎక్స్‌ప్రెస్ రైలును సికింద్రాబాద్ నుంచి కాజీపేట మధ్య పాక్షికంగా రద్దు చేశారు. ఈ రైలు కేవలం కాజీపేట నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్యనే నడుస్తుందని దక్షిణ మధ్య రైల్వే అధికారులు పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరి మృతి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 4: మండలంలోని డబ్బా గ్రామ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అమ్మక్కపేట గ్రామానికి చెందిన ఎలాలా రవికాంత్ రెడ్డి (45) మృతి చెందినట్లు ఎస్ఐ ఉమాసాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అమ్మక్కపేటకు చెందిన రవికాంత్‌రెడ్డి బైక్‌పై డబ్బ నుంచి అమ్మక్కపేటకు వెళ్తున్నాడు. డబ్బ గ్రామానికి చెందిన గరికే ప్రసాద్ బైక్‌పై గ్రామ శివారు నుంచి ఎదురుగా వస్తూ రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మాధ్యలో రవికాంత్‌రెడ్డి మృతి చెందాడు. ప్రసాద్‌కు తీవ్ర గాయాలు కాగా నిజామాబాద్ ఆసుపత్రి తరలించినట్లు తెలిపారు. రవికాంత్‌రెడ్డికి ఇద్దరు కొడుకులు, భార్య ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెప్ప వాలని రాత్రి కవితా సంపుటికి జాతీయ పురస్కారం





అవార్డు పొందిన కవిత్వ సంకలనం, కవి వంశీకృష్ణ

- అవార్డు ఫలితాలు వెల్లడించిన రంగినేని ట్రస్ట్ కన్వీనర్ లక్ష్మణ్

సిరిసిల్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కవులు, రచయితలను ప్రోత్సహిస్తూ ఉత్తమ సాహిత్యానికి బాటలు వేస్తున్న సిరిసిల్లకు చెందిన రంగినేని సుజాతమోహన్‌రావు ఎడ్యుకేషనల్, చారిటబుల్ ట్రస్ట్ ప్రతీ సంవత్సరం జాతీయస్థాయిలో అందిస్తున్న రంగినేని ఎల్లమ్మ జాతీయ సాహిత్యా పురస్కారం 2023 ఫలితాలను ట్రస్ట్ అధ్యక్షుడు రంగి నేని మోహన్‌రావు, అవార్డు కమిటీ కన్వీనర్ మద్దికుంట లక్ష్మణ్ ఆదివారం వెల్లడించారు. ట్రస్ట్ ద్వారా ఒక సంవత్సరం కథాసంపుటికి, మరో సంవత్సరం కవితా సంపుటికి అవార్డులను అందిస్తున్నారు. 2023 సంవత్సరానికి పోటీకి వచ్చిన కవితా సంపుటిల్లో వరంగల్ జిల్లాకు చెందిన కవి, కథకుడు, విమర్శకుడు వంశీ కృష్ణ వెల్లడించిన రెప్ప వాలని రాత్రి కవితా సంపుటి ఎల్లమ్మ జాతీయ పురస్కారం దక్కించుకుంది. మార్చిలో ట్రస్ట్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేయనున్నారు. వరంగల్ జిల్లా గుండ్రాతిమడుగు గ్రామానికి చెందిన తాటికొండల వంశీ కృష్ణ సప్తగిరి గ్రామీణ బ్యాంక్‌లో పనిచేస్తున్నారు. 1990 నుంచి రచన, వ్యాసాంగాన్ని ప్రారంభించి ఐదు కవిత్వ సంపుటాలు, రెండు కథ సంపుటాలు, రెండు సినిమా వ్యాస సంకలనాలు వెలువరించారు. కవిగా కాకుండా మంచి విమర్శకుడిగా కూడా తన రచనలను కొనసాగిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఉత్తమ సినీ విమర్శకుడి అవార్డును కూడా వంశీ అందుకున్నారు. రంగినేని జాతీయ పురస్కారానికి ఎంపికైన వంశీని పలువురు, రచయితలు, కవులు అభినందించారు.

పరిహారం కోసం పడిగాపులు



మానువాడలో నిర్మించిన మధ్య మానేరు జలాశయం

- 15 ఏళ్లుగా మిడ్‌మానేరు నిర్వాసితుల నిరీక్షణ
- గత ప్రభుత్వంలో పరిహారం చెల్లింపుపై నిర్లక్ష్యం
- కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఆశలు

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 4: తమ సర్వస్వాన్ని దారపోసి మధ్యమానేరు జలాశయానికి ఊపిరిపోసిన నిర్వసితులు పరిహారం కోసం పడిగాపులుకాస్తున్నారు. తమవిలువైన భూములు, తమ గొడ్డుగోద ఉపాధిని వదిలేసి పొట్టచేత పట్టుకుని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు పొట్టచేతబట్టుకుని ఉన్నఫలంగా తరలివచ్చారు. బోయినపల్లి మండలం మానువాడ వద్ద ఏర్పాటు చేసిన మధ్యమానేరు జలాశయంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో 11 గ్రామాలు ముంపు గ్రామాలుగా ప్రకటించారు. ఆరెపల్లి, సంకెపల్లి, రుద్రవరం, అనుపురం, కొడుముంజ, శాభాష్‌పల్లి, చింతలఠాణా, చీర్లవంచ, గుర్రంవాణిపల్లి, కొదురుపాక, నీలోజి పల్లి, వర్దవెల్లి గ్రామాలు ముంపునకు గురయ్యాయి. 2008 సంవత్సరంలో 12 గ్రామాల్లో 10,683 కుటుంబాలు ముంపునకు గురవుతున్నట్లు గుర్తించి గెజిట్ ప్రకటించారు. ముంపునకు గురువుతున్న ఒక్కో కుటుంబానికి రెండు గుంటల స్థలంతోపాటు వృత్తి ఆధారంగా పరిహారం చెల్లించేందుకు నిర్ణయించారు. నిర్వాసితులకు 2010 సంవత్సరం నుంచి పరిహారం చెల్లించడం ప్రారంభించారు. 10,683 కుటుంబాలకు గాను 10,044 కుటుంబాలకు మాత్రమే పరిహారం చెల్లించారు. మిగతా 639 మంది నిర్వాసిత కుటుంబాలకు 219 మంది కుటుంబాలకు చెందిన నిర్వాసితుల సంతకాలను అధికారులు సేకరించి బడ్జెట్ కోసం రూ. 20.22 కోట్లుతో నివేదికను ప్రభుత్వానికి అందించారు. మిగిలిన 420 మంది నిర్వాసిత కుటుంబాల్లో కొంత మంది కోర్టును ఆశ్రయించగా మరికొంత మంది వృత్తి మార్పులు తప్పులుగా పడటంతో పాటు వివిధ కారణాలతో పరిహారం తీసుకోలేదు. వీరి కోసం మరో రూ. 30.61 కోట్లు చెల్లించాల్సిన అవసరం వుందని తెలుస్తోంది. గత ప్రభుత్వం విడతల వారీగా నిర్వాసితులకు పరిహారం చెల్లిస్తు 10 సంవత్సరాలు గడిచిన పూర్తిస్థాయిలో నిర్వాసితులకు పరిహారం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, నిర్వాసితుల పక్షాన నిలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపైనే నిర్వాసితులు గంపెడు ఆశతో వున్నామని చెబుతున్నారు.

● 501 మంది యువతకు అందాల్సిన పరిహారం..

మధ్యమానేరు జలాశయంలో ముంపునకు గురువుతున్న నిర్వాసిత యువతి, యువకులకు ఒక కటాఫ్ డేట్‌తో ప్రతీ ఒక్కరికి రెండు లక్షల రూపాయల పరిహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ముంపు గ్రామాల్లో మొత్తం 3,917 మంది యువతను గుర్తించారు. అందులో యువతులు 2,303 మందికి గాను 1,879 మందికి రెండు లక్షల రూపాయల చొప్పున పరిహారం చెల్లించారు. ఇంకా 335 మంది యువతల వద్ద సంతకాలు సేకరించి బడ్జెట్ కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించారు. మిగతా 89 మంది యువతల సంతకాలు మాత్రమే సేకరించారు. వారికి ఇంకా పరిహారం చెల్లించాల్సివుంది. కాగా 1,614 మంది యువకులకు గాను 1,537 మందికి పరిహారం చెల్లించగా 28 మంది యువకుల సంతకాలు సేకరించి బడ్జెట్ కోసం నివేదికను ప్రభుత్వానికి పంపించారు. మిగిలిన 49 మంది యువకులు వివిధ కారణాలతో పరిహారం తీసుకోవడం లేదు వారికి ఇంక చెల్లించాల్సి ఉంది.

కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఆశలు..

- నాగుల శంకరయ్య, సంకెపల్లి



వేములవాడ మండలం సంకెపల్లి గ్రామం మాది. తన ఇళ్లు ముంపునకు గురువుతుంది. అధికారులు వచ్చిన దరఖాస్తులు తీసుకువెళ్లారు. ఇప్పటి వరకు నాకు ఇంటి పరిహారం అందలేదు. ప్రభుత్వానికి నివేదిక పంపించామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వాసితులపై శ్రద్ధ తీసుకుని పరిహారం త్వరగా ఇప్పించాలని కోరుతున్నాం.

సంతకాలు తీసుకున్నారు.. పరిహారం రాలేదు..

- జి జ్యోతి, రుద్రవరం, నిర్వాసిత యువతి



మాది రుద్రవరం గ్రామం. ప్రభుత్వం కటాఫ్ తేదీ ప్రకారం నేకు పరిహారం అందాల్సిఉంది. గ్రామపంచాయతీకి వచ్చి అధికారులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు, సంతకాలు తీసుకుని వెళ్లారు. ఇప్పటి వరకు పరిహారం మాత్రం అందలేదు. ప్రభుత్వం చొరవ తీసుకుని పరిహారం అందజేయాలి.

ముంపు గ్రామాల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మధ్యమానేరు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తాం. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తాము. ఎన్నికల సమయంలో నిర్వాసిత కుటుంబాలకు ఐదు లక్షల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చాము. గ్రామానికి ఒక్క ప్రత్యేక అధికారిని ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తాము. 15 రోజుల్లో నిర్వాసితుల సమస్యలపై సమావేశం ఏర్పాటు చేసి పరిష్కారం చేస్తాం. కంపెనీల ఏర్పాటుతో నిర్వాసితులకు ఉపాధి కల్పిస్తాం.







పెద్దపల్లి కాంగ్రెస్ టికెట్ కోసం ఉద్యమకారుడి దరఖాస్తు

పెద్దపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం తెలంగాణ ఉద్యమకారుడు ఈర్ల సురేందర్ టీపీసీసీకి ఈనెల 3న దరఖాస్తు చేసుకున్నారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు అధికంగా ఉన్నారని, అదే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తినని పేర్కొన్నారు. టీడీపీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన ఆయన 2001లో టీఆర్ఎస్ ఆవిర్భావంతో ఆ పార్టీలో చేరారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆయన 2005లో మాజీ కేంద్ర మంత్రి వెంకటస్వామి, మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే గీట్ల ముకుందరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

ఎంపీ టికెట్ మాదిగ సామాజిక వర్గానికి కేటాయించాలి

సుల్తానాబాద్, ఫిబ్రవరి 4: పెద్దపల్లి పార్లమెంట్(ఎస్సీ) నియోజకవర్గం టికెట్‌ను మాదిగ సామాజిక వర్గానికి కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు న్యాతరి శ్యాంసుందర్ డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ శనివారం తాను గాంధీభవన్‌లో పార్టీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నానన్నారు. తాను నలభై ఏళ్లుగా పార్టీలో పనిచేస్తున్నానని, తనకు టికెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

ధర్మారం సమ్మక్క, సారక్క జాతర కమిటీ ఎన్నిక

ధర్మారం, ఫిబ్రవరి 4: ధర్మారంలో త్వరలో నిర్వహించే సమ్మక్క-సారక్క జాతర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం ధర్మారంలోని సీతల్ల చెరువు సమీపంలో సమ్మక్క-సారక్క జాతర జరిగే ప్రదేశంలో ఏర్పాట్లపై అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఎలాంటి ఇబ్బందులు కల్గకుండ తాత్కాలికంగా రోడ్డు నిర్మాణ పనులు చేయాలని అన్ని వర్గాల ప్రజలు తీర్మానించారు. కమిటీ కన్వీనర్‌గా వైస్‌ఎంపీపీ మేడవేని తిరుపతి, కోశాధికారిగా ఓరెం చిరంజీవితోపాటు 30మంది సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వైభవంగా సుందరకాండ పారాయణం

మంథని, ఫిబ్రవరి4: లోక కల్యాణార్థం మున్సిపల్ పరిధిలోని బోయిని పేటలోని శ్రీబలవీర హనుమాన్ దేవాలయంలో మూడు రోజులుగా వైభవంగా కొనసాగిన సుందరకాండ పారాయణం ఆదివారం ముగిసింది. వేద బ్రాహ్మణ పండితులు నల్లగొండ మధనగోపాల్‌శర్మ, దుద్దిళ్ల మారుతిశర్మల ఆధ్వర్యంలో వొజ్జల గణేష్‌శర్మ, మారుపాక ప్రశాంత్ శర్మ, దుద్దిళ్ల సంతోష్‌శర్మ తోపాటు పలువురు వేదపండితులు సుందరకాండ పారాయణంతో పాటు వివిధ పూజా కార్యక్రమాలను వేదోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈసందర్భంగా శ్రీబల వీర హనుమాన్ స్వామి వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలరించగా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి దర్శించుకున్నారు.

భద్రాచల రాముల వారికి కాలనీ నుంచి తలంబ్రాలు



తలంబ్రాలను సిద్ధం చేస్తున్న భక్తులు

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 4: భద్రాచల సీతారాముల కళ్యాణ మహోత్సవానికి తలంబ్రాలను కాలనీ నుంచి భక్తులు పంపించారు. ఆదివారం భక్తాంజనేయస్వామి ఆలయంలో మహిళా భక్తులు వడ్లను ఒలిచి తలంబ్రాలు తయారు చేశారు. వీటిని రాముల వారి కళ్యాణానికి పంపారు. ఈకార్యక్రమంలో శ్రీరాజరాజేశ్వరి సేవా సమితి సభ్యులు సదానందం,రమేష్, గడ్డం తిరుపతి, సంగీత, సుజాత, భాగ్యలక్ష్మి, నాగేశ్వరి, సుశీల, అనసూయ, భక్తులు పాల్గొన్నారు.

యోగా పోటీల విజేతకు సన్మానం

ధర్మారం, ఫిబ్రవరి 4 : ఇటీవల మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో కాకా వెంకటస్వామి స్మారక ట్రస్టు నిర్వహించిన జాతీయ స్థాయి యోగా పోటీలో ప్రథమ స్థానం పొందిన మండలంలోని నందిమేడారం గ్రామానికి చెందిన చెనెల్లి మల్లేశంను ఆదివారం తోటి యోగా సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఎలగందుల అశోక్,కవిత, మామిడిశెట్టి శ్రీనివాస్, భాగ్య, మల్యాల సత్యనారాయణ, ఎండీ సలీం, సురేందర్, శ్రీనివాస్‌రెడ్డి, చారి, గంగన్న, శేఖర్, శ్రీనివాస్, శ్రీధర్, సాగర్ తదతరులు ఉన్నారు.

అవార్డుల ప్రదానం



బండ రవీందర్‌రెడ్డిని సన్మానిస్తున్న వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్, ఎలిగేడు, ఓదెల, జనవరి 4: హన్మకొండలో స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పలువురికి తెలుగు వెలుగు మహానంది అవార్డులను ప్రదానం చేశారు. మండలంలోని లక్ష్మీపురం మాజీ సర్పంచ్ బండ రవీందర్‌రెడ్డికి సర్పంచ్‌గా తన పదవీబాధ్యతల సమయంలో ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దినందుకు గాను పురస్కారం లభించింది. అలాగే సుల్తానాబాద్‌కు చెందిన జ్యోతిష్య, వాస్తు రంగంలో సేవలందించినందులకు గాను చిలుమజు వీరనారాయణ చార్యులకు, పదేళ్లుగా క్రీడారంగంలో విశేష సేవలందించి వ్యాయామ ఉపాధ్యాయుడు ఆలేటి సంపత్ కుమార్, తెలుగు వెలుగు మహానంది అవార్డును ప్రదానం చేశారు. అలాగే ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన ప్రముఖ ఆర్టిస్ట్ చిల్లోజు శ్రీనివాస్ బాబుకు అవార్డును ప్రదానం చేశారు. అలాగే ఎంబ్రాయిడర్ కళా సేవరంగంలో కొన్నాళ్ల నుంచి కృషి చేస్తున్నందున ఓదెల మండల కేంద్రానికి చెందిన క్యాతం శ్రీనివాస్ అనే టైలర్‌కు అవార్డును ప్రదానం చేశారు.

రక్తదానం

కోల్‌సిటీ, ఫిబ్రవరి 4: ప్రాణాపాయస్థితిలో ఉన్న రోగికి అత్యవసరంగా రక్తం అవసరం కాగా 44వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ ముస్తాఫా రక్తదానం చేశారు. లక్ష్మీనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు అత్యవసరంగా ఏబీ పాజిటివ్ రక్తం అవసరం ఉండగా రక్తదానం చేశారు.

బొబ్బిలికుంటను కబ్జా కాకుండా చూడాలి

- ఉపాధి కోల్పోతామని ముదిరాజ్‌ల ఆందోళన



ఆందోళన చేస్తున్న ముదిరాజ్ కులస్థులు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 4 : మండలంలోని తుర్కలమద్దికుంట గ్రామంలో 40 ఏళ్లుగా సుమారు 300 కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయని, బొబ్బిలికుంటను కొంతమంది వ్యక్తులు కబ్జా చేసుకోని ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆదివారం ముదిరాజ్ కులస్థులు ఆందోళన చేపట్టారు. గ్రామంలోని బొబ్బిలికుంటను గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా చెరువు శిఖం భూమిలో మట్టిని పోసి కబ్జా చేసేందుకు యత్నం చేస్తున్నారని, దీనిని అడ్డుకున్న వారిని బెదిరింపులకు గురిచేయడంతో పాటు పోలీసులచే కేసులు నమోదు చేస్తున్నారని వాపోయారు. గత 40 ఏళ్లుగా బొబ్బిలి కుంట 40 ఎకరాల నీటి అడుగుభాగం ఉండగా 5 ఎకరాలు శిఖం భూమి ఉందని అధికారులు రికార్డులు అందించారని, కాని కుంట భూమిలో ఎలాంటి హస్తం లేకున్నా భూమి తనదేనంటూ రాత్రివేళలో జేసిబి సహాయంతో చెరువును చదును చేస్తూ కబ్జా చేసేందుకు యత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం అధ్యక్షులు రాచకొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ముత్యాల చంద్రయ్య, సెక్రటరి కనకట్ల స్వామిలతో పాటు పలువురు ముదిరాజ్ కులస్థులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుతాం..

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి



రవీందర్‌కు కండువా కప్పుతున్న సునీల్‌రెడ్డి

గోదావరిఖని, జనవరి 4: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాషాయం జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు బీజేపీ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. బజరంగ్‌దళ్ ప్రధానకార్యదర్శి అయోధ్య రవీందర్‌తో సహా 500మంది వివిధ క్షేత్రాలకు చెందిన కార్యకర్తలు బీజేపీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆదివారం గోదావరిఖనిలోని ఒక ప్రైవేట్ హోటల్‌లో జరిగిన చేరికల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇప్పటికే రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ భూస్థాపితం అయ్యిందని, ప్రజలు బీఆర్ఎస్‌ను నమ్మే పరిస్థితుల్లో లేరని, మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాల అమలులో వెనుకబడిపోయిందని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ భారీ మెజార్టీతో ప్రధాని నరేంద్ర మోదీ మూడవ సారి ప్రధానమంత్రి కాబోతున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కందుల సంధ్యారాణి, బల్మూరి వనిత, మాతంగి రేణుక, బల్మూరి అమరేందర్‌రావు, వడ్డేపల్లి రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

పగిలిన మిషన్ భగీరథ పైపు.. నీటి సరఫరాలో అంతరాయం



మురుగు కాల్వలోకి ప్రవహిస్తున్న మిషన్ భగీరథ నీరు

ధర్మారం, ఫిబ్రవరి 4: ధర్మారం మండల కేంద్రంలో గల దళిత కాలనీ సమీపంలో రోడ్డు పక్కన మంచినీటి పైపులైన్ పగిలింది. ఆదివారం ఉదయం పైపు పగిలి పక్కన ఉన్న మురుగు కాల్వలోకి తాగునీరు ప్రవహిస్తోంది. అదేవిధంగా అటు వైపు కూడా పైపులు లీకేజీ అయినా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. తాజాగా ఇటు వైపున్న పైపు పగలడంతో మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం కలుగుతోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ పైపులైన్‌లు లీకేజీ అయితే తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించిన మరమ్మత్తులు చేయడం లేదు. ఇప్పటికైనా ప్రజలకు తాగునీటి సమస్యకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కాలనీ వాసుల సమస్యల పరిష్కారానికి కృషి

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, ఫిబ్రవరి 4: ఎఫ్‌సీఐ గౌతమినగర్ అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరిస్తానని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. ఆదివారం గౌతమినగర్‌లోని ఎఫ్‌సీఐ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ పక్షాన గుంపుల బాలరాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కాలనీవాసులు సన్మానించారు. కాలనీవాసులు సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే ఎప్పటికప్పుడు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహంకాళి స్వామి, రాజిరెడ్డి, సాంబమూర్తి, గుంపుల తిరుపతి, కాలనీ ప్రతినిధులు భద్రయ్య, గంగాధర్, రాజారావు పాల్గొన్నారు.

సమాజంలో పాత్రికేయుల పాత్ర కీలకం

పాలకుర్తి, ఫిబ్రవరి 4: సమాజంలో పాత్రికేయుల పాత్ర కీలకమని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. పాలకుర్తి మండల ప్రెస్ క్లబ్ సభ్యులు ఆదివారం రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్‌తో పాటు మాజీ సర్పంచ్‌లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో పాత్రికేయుల పాత్ర కీలకమని, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ నిరంతరం ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా పాత్రికేయులు పని చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొంకటి రవిందర్, సీపెల్లి రాజేశం, ప్రధాన కార్యదర్శి జి తిరుపతి, కోశాధికారి మాదాసు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

16న జరిగే సమ్మెను జయప్రదం చేయాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

పెద్దపల్లిటౌన్, జనవరి 4: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. కార్మిక, ఉద్యోగ సంఘాల జిల్లా సదస్సును పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న ఏఐటీయూసీ, సీఐటీయూ, హెచ్‌ఎంఎస్, ఐఎఫ్‌టీయూ, టీఎన్‌టీయూసీ, ఏఐఎఫ్‌టీయూ సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శులు కదారి సునీల్, ఎరవెల్లి ముత్యంరావు, రమేష్, కే.విశ్వనాథం, బి.అశోక్, తోకల రమేష్, కంది చంద్రయ్య, రాములు మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 16న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు మార్చుకోకపోతే, నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో గద్దె దింపేందుకు ప్రజలు సిద్ధం కావాలని కోరారు. కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చే లేబర్ కోడ్లను రద్దు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు చేయరాదని, వ్యవసాయ రంగాన్ని కార్పొరేటర్లకు అప్పజెప్పే విధానం మానుకోవాలని హితవు పలికారు. ఈ సదస్సులో వివిధ సంఘాల నాయకులు వేల్పుల కుమారస్వామి, జి. సత్యనారాయణరెడ్డి, సతీష్, ఎస్ రవీందర్, భీమయ్య, ఎరవెల్లి ముత్యంరావు, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ జట్ల ఎంపిక పోటీలకు స్పందన

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 4: జిల్లా సబ్‌జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక పోటీలకు స్పందన లభించింది. ఆదివారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నిర్వహించిన ఈ పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 161 మంది బాలురు, 97 మంది బాలికలు హాజరయ్యారు. వీరికి కబడ్డీ పోటీలు నిర్వహించి విశేషప్రతిభకనబరిచిన క్రీడాకారులను ఈనెల 16నుంచి 19వరకు సూర్యాపేట జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చల్మెడ లక్ష్మీనర్సింహారావు, సిహెచ్.సంతరావు పర్యవేక్షించారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యేల పరామర్శ

చొప్పదండి, ఫిబ్రవరి 4: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేశం తండ్రి ఇటీవల మరణించగా ఆయన దశదిన కార్యక్ర మానికి ఆదివారం మానకొండూర్, చొప్పదండి, పెద్దపల్లి, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, సీహెచ్ విజయరమణారావు, వెడ్మ బొజ్జు హాజరయ్యారు. చొప్పదండి మండలం కొలిమికుంటలో జరిగిన కార్యాక్రమానికి ఎమ్మెల్యేలు హాజరై సత్తు నర్సయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాలర్పించారు. డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్‌రెడ్డి తదితరులున్నారు.

కరాటే పోటీల్లో షోటోకాన్ విద్యార్థుల ప్రతిభ



మెడల్స్ సాధించిన విద్యార్థులు

మంథని, ఫిబ్రవరి 4: కరీంనగర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఇండో టు నేపాల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో మంథని షోటోకాన్ కరాటే ఇన్‌స్ట్రక్టర్ కోండ్ర నాగరాజు ఆధ్వర్యంలో పాల్గొన్న విద్యార్థులు కటా, కుమిత్ విభాగాల్లో మెడల్స్ శనివారం సాధించారు. బీర ఆదిత్య, తేజ బ్లాక్ బెల్ట్ కటా విభాగంలో గోల్డ్ మెడల్, కుమిత్‌లో సిల్వర్, శ్రీరాజ్ గోల్డ్ మెడల్, వడ్లకొండ శ్రీనిత కటాలో సిల్వర్, హాసిని కటాలో సిల్వర్, సహస్ర కటాలో సిల్వర్ మెడల్, శాదిత్య సిల్వర్ మెడల్, నిక్షేప్‌సాయి కటాలో సిల్వర్, ఐశ్వర్య కటాలో బ్రాంజ్, శివకాశి కటాలో బ్రాంజ్ మెడల్ సాధిచారు. మెడల్స్ గెలుపొందిన విద్యార్థులను మంథని షోటో ఖాన్ కరాటే జోనల్ ఇన్‌స్ట్రక్టర్ నూకల భానయ్య అభినందించారు.

కుక్కల దాడిలో మేకలు మృతి

మంథని, ఫిబ్రవరి 4: మున్సిపాలిటీ పరిధిలోని గొల్లగూడెంలో ఆర్నే రాజయ్యకు చెందిన 10మేక పిల్లలు కుక్కల దాడిలో మృతి చెందాయి. ఇంటి సమీపంలో మేక పిల్లలు ఉంచి మేకలు మేపేందుకు రాజయ్య వెళ్ళగా ఈ ఘటన చోటుచేసుకుంది. వీటి విలువ సుమారు లక్ష వరకు ఉంటుంది.

అమృత కలశాల పంపిణీ

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 4: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేద కుటుంబాలకు అమృత కలశాలలను పంపిణీ చేశారు. కేకేనగర్, సంతోష్ నగర్, కమాన్‌పూర్‌లో 11 పేద కుటుంబాలకు 11 నిత్యావసర సరుకులతో కూడిన కలశాలను అందజేశారు. సత్యసాయి సేవా కార్యక్రమాల్లో భాగంగా పేదరికంతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి సరిపడా నిత్యావసర సరుకులను ప్రతి నెల మొదటి ఆదివారం అందజేస్తున్నట్టు సభ్యులు తెలిపారు. ఈకార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, సభ్యులు నరింహాచారి, దేవారెడ్డి, రాంరెడ్డి దొరైరెడ్డి, చందు, సీతారం పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

రామగిరి, ఫిబ్రవరి 4: రామగిరి మండలం ఆదివారంపేట్ గ్రామానికి చెందిన కన్నూరి ఓదెలు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబానికి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు మాజీ జడ్పీటీసీ మైదం భారతి వరప్రసాద్‌లు రూ.2వేల ఆర్థిక సహాయంతో పాటు బియ్యం అందజేశారు. కల్వచర్ల గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ సులిగే లక్ష్మి ఇటీవల పాటుకాటుకు గురి కాగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రూ.6,500 ఆర్థిక సహాయం అందజేశారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు గడ్డం శ్రావణ్, బెల్లంశ్రీనివాస్, గంటవెంకటరమణరెడ్డి, మేకల మారుతీ, శ్రీధర్, కళాధర్‌రెడ్డి, సురేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి ఉత్సవాలు



బోనంతో ఊరేగింపుగా వెళ్తున్న ముదిరాజ్ కులస్తులు

రామగిరి, ఫిబ్రవరి 4: మండలంలోని బేగంపేట్ గ్రామంలో పెద్దమ్మతల్లి ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి మొదటి వార్షికోత్సవాన్ని నిర్వహించారు. అత్యంత భక్తి ప్రపత్తులతో పెద్దసంఖ్యలో మహిళలు అమ్మవారి బోనంతో గ్రామ పుర వీధుల గుండా ఊరేగింపు చేపట్టారు. ఆలయంలో కొటగడ్డల శివచందర్‌శర్మ ప్రత్యేక పూజలను నిర్వహించారు. గురువారం బలి కార్యక్రమం ఉంటుందని ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బేతి కనుకయ్య, సొసైటి అధ్యక్షుడు బొంతల రవి తెలిపారు.

'బీఆర్ఎస్ సమావేశానికి కార్యకర్తలు తరలిరావాలి'

ఎలిగేడు, ఫిబ్రవరి 4: పెద్దపల్లి మండలం రాఘవపూర్‌లో సోమవారం మధ్యాహ్నం జరిగే బీఆర్ఎస్ నియోజకవర్గస్థాయి సమావేశానికి మండలంలోని 12గ్రామాలకు చెందిన పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి రావాలని ఎంపీపీ తానిపర్తి స్రవంతిమోహన్‌రావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో భారతీయ రాష్ట్రసమితి పూర్వ వైభవం తెచ్చుకుంటూ కార్యకర్తలకు మనోధైర్యం నింపడానికి మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిలు పాల్గొంటారని చెప్పారు.

రేపు మామిడితోట వేలం

ఎలిగేడు, ఫిబ్రవరి 4: మండలంలోని 30తోట గ్రామంలో 22ఎకరాల మామిడి తోటను బహిరంగ వేలం వేస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ ఎంపీవో అనిల్‌రెడ్డి తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.20వేలు సంబంధిత సెక్రటరీ పేరును డిపాజిట్ చేసి రూపేనా అందివ్వాలన్నారు. వేలంలో దక్కించుకున్నవారు ఏడు రోజుల్లో డిపాజిట్ చెల్లిస్తే తోటను వారికి స్వాధీన పరుస్తామన్నారు. లేకుంటే డిపాజిట్ జప్తు అవుతుందని తెలిపారు. డిపాజిట్ చేసిన వారే వేలంలో పాల్గొనాల్సి ఉంటుందని. వేలాన్ని రద్దు చేయాలన్నా గ్రామపంచాయతీకి పూర్తి అధికారం ఉంటుందన్నారు. కావలసిన వారు ముప్పిరితోట సెక్రెటరీని సంప్రదించాలని కోరారు.

నియామకం

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 4: తెలంగాణ రాష్ట్ర ట్రైయాతలాన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గోదావరిఖనికి చెందిన ఆరెపల్లి శ్రీను అలియాస్ టైసన్ శ్రీనును నియ మించినట్టు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మదన్మోహన్ చెప్పారు. ఆదివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని 33జిల్లాల్లో నూతన కమిటీలను నియమిస్తున్నట్టు, పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరెపల్లి శ్రీనును నియమించినట్టు, రానున్న రోజుల్లో అంతర్జాతీయ స్థాయిలో ట్రైయాతలాన్ పోటీల ను నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో శ్రీశైలం, కృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, జగన్మో హన్, సాగర్, గణపతి, రొడ్డ శ్రీనివాస్, రమేష్, క్రాంతి, వినో ద్, మురళి, నీలకంఠ పాల్గొన్నారు.

బస్సులు లేక ఇబ్బందులు..

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 4: జిల్లా కేంద్రం నుంచి కాల్వశ్రీరాంపూర్‌కు సరిగా బస్సులు లేని కారణంగా ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పెద్దపల్లి నుంచి కాల్వశ్రీరాంపూర్ షటిల్ బస్సు ఉండేది. బస్సు ప్రతి రోజు ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు పెద్దపల్లి నుంచి కాల్వశ్రీరాంపూర్ ఐదు ట్రిప్పులు నడిచేది. దీంతో ప్రయాణీకులు కాల్వశ్రీరాంపూర్ నుంచి పెద్దపల్లి జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు సౌకర్యంగా ఉండేది. ప్రస్తుతం మోడల్ స్కూల్‌కు మాత్రమే ఒకే ఒక బస్సు వస్తుందని, మోడల్ స్కూల్‌కు సెలవు ఉన్న రోజు ఆ బస్సు కూడా రాదని ప్రయాణీకులు పేర్కొంటున్నారు. పెద్దపల్లి నుంచి గోదావరిఖని డిపోకు చెందిన నైట్ బస్సు కూడా ఉండేది. నైట్‌హాల్ట్ బస్సు గత కొన్ని నెలలుగా నడవడం లేదు. దీంతో ప్రయాణీకులు అవస్థలు పడుతున్నారు. కాల్వశ్రీరాంపూర్‌లో నైట్‌హాల్ట్ బస్సు ఉంటే ఉదయం పెద్దపల్లిలో ట్రైన్‌కు వెళ్లేవారు కూనారం, మంగపేట, వెన్నంపల్లి తదితర గ్రామాల ప్రయాణీకులు నైట్‌హాల్ట్ బస్సులోనే ప్రయాణించేవారు. బస్సు లేకపోవడంతో ఉదయం ఇబ్బందులు పడుతున్నారు. పెద్దపల్లిలో 9గంటలకు బస్సు ఉంటే మళ్లీ 1గంట వరకు కాల్వశ్రీరాంపూర్‌కు వచ్చేందుకు బస్సులు లేకపోవడంతో ఆటోలను ఆశ్రయిస్తున్నారు. దీంతో మహిళలు, గృహలక్ష్మి పథకంతో ఉచితంగా ప్రయాణం చేయాల్సి ఉన్నా బస్సులు లేని కారణంగా ఆటోల్లో ప్రయాణించాల్సి వస్తుందని వాపోతున్నారు. సాయంత్రం 6గంటలు దాటితే పెద్దపల్లి నుంచి కాల్వశ్రీరాంపూర్‌కు బస్సు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. షటిల్ బస్సుతో పాటు నైట్ హాల్ట్ బస్సును మళ్లీ నడిపించి తమ బాధలు తీర్చాలని ప్రయాణీకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

నీరుకుళ్ల సమ్మక్క జాతరకు ముమ్మర ఏర్పాట్లు

- భక్తుల విడిది కోసం యాభై ఎకరాల స్థలం సిద్ధం



జాతరకు ముస్తాబవుతున్న రంగనాయకులస్వామి ఆలయం



సమ్మక్క-సారలమ్మలు కొలువుదీరనున్న గద్దెలు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 4: సుల్తానాబాద్ మండలంలోని నీరుకుళ్ల గ్రామంలోని సమ్మక్క జాతర నిర్వహణకు అన్ని ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. ప్రతి ఏటా పెద్దఎత్తున భక్తులు పాల్గొనే ఈ జాతర కోసం నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. మానేరు వాగును ఆనుకుని రంగనాయకుల దేవాలయం ఉండడం, భక్తుల స్నానాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిత్యం మానేరు నిండా నీరు ఉండడం, భక్తులు సులభంగా స్నానాల చేయడం కోసం మానేరులో నిర్మించిన స్నానగట్టాలు భక్తులకు సౌకర్యవంతంగా ఉన్నాయి. దేవాలయం ప్రాంగణంతో పాటు చుట్టూ మాడవీధుల నిర్మాణం ఇతర అభివృద్ధి పనులు చేపట్టడంతో ఉమ్మడి జిల్లా నుంచి భక్తులు జాతరకు వచ్చే అవకాశం ఉందని నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. దాదాపు ఆరు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. రంగనాయకుల ఆలయం అభివృద్ధిలో భాగంగా ఇక్కడ నాలుగు కోట్ల నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ పనులు ప్రస్తుతం సమ్మక్క జాతర కోసం వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా మారనున్నాయి.

సమ్మక్క-సారలమ్మ గద్దెల ముస్తాబు

ఈనెల 22 నుంచి జాతర నిర్వహించేందుకు నీరుకుళ్ల గ్రామంలోని సమ్మక్క-సారలమ్మ జాతర ప్రాంగణాన్ని అందంగా ముస్తాబు చేశారు. వనదేవతలు కొలువుదీరే గద్దెలకు రంగులు వేయించారు. అమ్మ వారలను దర్శనం చేసుకునేందుకు భక్తుల కోసం క్యూ లైన్లను నిర్మించారు. మొత్తం మీదు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జాతర నిర్వాహకులు తెలిపారు.

● జాతరకు సర్వం సిద్ధం చేశాం

నర్సయ్య గౌడ్, జాతర కమిటీ చైర్మన్



నర్సయ్యగౌడ్

సమ్మక్క జాతర కోసం నీరుకుళ్లలో అన్ని ఏర్పాట్లు చేశాం. యాభై ఏళ్ల నుంచి ఇక్కడ జాతర నిర్వాహిస్తున్నారు. ఈ అనుభవంతో తాము భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతి సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నాం. ఇటు నీరుకుళ్ల గ్రామం నుంచి, అటు రంగంపల్లి, కోమండ్లపల్లి గ్రామాల వైపు నుంచి జాతర ప్రాంగణంకు వచ్చే రోడ్ల ఇరు పక్కల స్థలాలను భక్తుల కోసం సిద్ధం చేశాం. భక్తులు విడిది చేసేందుకు వారు మూడు రోజులు ఉండే విధంగా జాతర సమీపంలో దాదాపు యాభై ఎకరాల స్థలం ఉంది. భక్తులు స్నానాలు చేసుకునేందుకు మానేరులో స్నాన ఘట్టాలు ఉన్నా కూడా రద్దీని దృష్టిలో ఉంచుకుని పలుచోట్ల పైపులైన్ల ద్వారా షవర్లను కూడా ఏర్పాటు చేస్తున్నాము. వేగురపల్లి లక్ష్మీపూర్ వైపు నుంచి వచ్చే వేలాది మంది భక్తులు వంతెన మీదుగా రావచ్చు. బస్సులు ఇతర వాహనాలు వారికి అందుబాటులో ఉంటాయి.